


# దుఃఖం

రామా చంద్రమౌళి

వ్యక్తిగతమైన పేర్ల
మీద ఒక కవర్‌ను
చీఫ్ జస్టిస్‌కు, మరో
కవర్‌ను గవర్నర్‌కు
కొరియర్‌లో పంపి ...
రాత్రి పది గంటలకు
ఇంటికి తిరిగొచ్చిన
చీఫ్ ఇంజనీర్ రమ
ణకు ఎంతో
దుఃఖంగా ఉంది.

ఫెళఫెళార్భాటాలతో
కూలబోతున్న ఆకా
శంలా,

యిక బ్రద్దలు
కాబోతున్న అగ్ని
పర్వతంలా...

గర్భాన వందల సునామీలను భరించి భరించి యిక ఉప్పెనై విస్ఫోటించ బోతున్న మహాసముద్రంలా...

రమణను దుఃఖం కకావికలు చేస్తోంది. అతను అంతస్సంఘర్షణతో పెను తుఫానులో గడ్డిపరకలా విలవిల్లాడిపోతున్నాడు. గత ముప్పది రెండేళ్ళుగా యింత వేదన తనలో పేరుకుపోయి పేరుకుపోయి యింత మహోధృత దుఃఖంగా పిడికెడు గుండెలో గర్జిస్తున్నదా అనిపించింది రమణకు.

ఎప్పుడు ప్రారంభమైన పరుగు యిది?

6, మార్చ్ 1974 – ఉద్యోగంలో తను ఎ.ఇ.గా జాయినింగ్ రిపోర్ట్ యిచ్చిన రోజు... ఆరోజునుండి ఒకటే పరుగు... ఎడతెగని పరుగు... నిరంతర అనంతమైన పరుగు...

డబ్బువెంట... పైరవీ వెంట – ప్రమోషన్ వెంట... అధికారం వెంట... అహంకారం వెంట... మదం వెంట... మత్సరం వెంట... పరుగు.

కళ్ళు మూసుకుపోయి, కళ్ళున్నాయనే విషయం మరచిపోయి, లోపల ఒక హృదయం, ఒక ఆత్మ... ఒక వివేకం – ఉన్నాయనే స్పృహను కోల్పోయి,

ఒకటే పరుగు... పరుగెత్తి పరుగెత్తి ఏండ్లకు ఏండ్లు, దశాబ్దాలకు దశాబ్దాలు పరుగెత్తి పరుగెత్తి... వచ్చీ వచ్చీ... యిప్పుడిక్కడ నోట్ల కట్టలపై, బంగారు కడ్డీలపై, సర్వ సుఖభోగాలపై నిలబడి, ఒక్క క్షణం లోలోకి చూచుకుంటే... ఏమున్నది –

అంతా దుఃఖం ... గుండెనిండా గూడుకట్టుకున్న దుఃఖం.

దుఃఖం యింత బీభత్సంగా, యింత భీకరంగా, యింత రంపపు కోతగా... చివరికి యింత ప్రశాంతంగా... అమ్మ తల నిమిరినట్టు యింత ఊరటగా... యింత సార్థకతగా ఉంటుందా.

రమణ ఐదు కోట్ల రూపాయల విలువచేసే జూబ్లీహిల్స్‌లో ఉన్న తన అద్భుత పాలరాతి భవనం బాల్కనీలో నిలబడి వెక్కెక్కిపడి దుఃఖిస్తున్నాడు.

బయట ఒకటే వర్షం...

తను యింట్లోకి వచ్చిన మరుక్షణమే ప్రారంభమైంది అనూహ్యమైన వర్షం... ఎవ్వరూ ఊహించనిది... మహోధృతంగా ... ఎక్కడి నుంచి వచ్చాయో మేఘాలు... నల్లని ఏనుగుల మందల వలె... ఆకాశం కూలిపోతోందా అన్నంత వర్షం... జడివాన... కుంభవృష్టి.

కురవనీ...

ఉప్పెనవలె... తన హృదయం వలెనే, కనలి కనలి, కరిగి కరిగి... బ్రద్దలౌతున్న జలభాండం వలె... వర్షం కురవనీ...

ఒక పాపం... ఒక పరిపక్వత... ఒక విస్ఫోటనం

ఒక నిష్కృతి... ఒక నిష్క్రమణ... ఒక నిర్వాణం

చివరికి.. యుద్ధం కొనసాగి కొనసాగి,

వర్షం కురిసి కురిసి,

జ్వాలలు ఎగిసి ఎగిసి – దహనం జరిగి జరిగి,

ఐతే చివరికి వర్షం ఎప్పటికైనా వెలుస్తుంది.

ఉధృతమైన వర్షం వెలిసిన తర్వాత బీభత్సం మిగుల్తుంది. కాని ఫలితం ఒక పవిత్రమైన, నిశ్చలమైన ప్రశాంతత కూడా మిగుల్తుంది తప్పకుండా.

యిక తనక్కూడా... ఈ దుఃఖం తర్వాత... వర్షం వెలిసి – ఒక బీభత్సం ముగిసి – ప్రశాంతత మిగుల్తుందా...?

రమణ వెనుదిరిగి నాల్గడుగులు నడిచి ఇరవై బై ముప్పయి ఫీట్లున్న తన పాలరాతి పడకగదిలోకి వచ్చాడు.

అంతా డబ్బు, సుఖాలు, భోగాలు... అహంకారపు వాసన గాలినిండా.

## నేను

మాట బాకయినా కాని

మౌనం మాత్రం లక్ష శరాఘాతాలు

మంచులాంటి నీ మౌనంతో

కోస్తున్న నెత్తుటి గుండెను

ఒంపుకోనూ లేక,

దాచుకోనూ లేక,

ఉప్పెనై పోటెత్తుతున్న

ఉప్పు సంద్రాన్ని

వెన్నెల దూరని వనం

వర్షం చూడని ఎడారి

నీవు లేని స్వర్గం

నేను

**– కుంది హరిప్రసాద్**

ఎదురుగా పక్షి పలకరింతగా... గడియారంలో టైం కిచకిచమంది. పదిన్నర గంటలు. గదినిండా చల్లని పసిడివెన్నెల కాంతిజల... ఎక్కడినుండొస్తుందీ వెలుగు... ప్చ్... ఏమో... కన్సీల్డ్... అంతా గుప్తం. ఏదీ బయటికి కనబడదు. అంతా లోపలే... లోలోపల... అంతరాంతరాలలో.

ఎదురుగా... తన బెడ్‌కు ఎదురుగా... రోజూ తను నిద్ర లేవగానే కనబడే తన యిష్టదైవం హనుమంతుని అద్భుత విగ్రహం, ప్రసన్న వదనం.. పవిత్ర పాదాలు –

పాదాల కింద ... రహస్యంగా ఉన్న ఖాళీస్థలంలో... స్టేట్ బ్యాంకాఫ్ ఇండియా లాకర్ తాళంచెవి... నంబర్ పదహారు.. తన లక్కీ నెంబర్ ఏడు.

ఆ తాళం చెవితో లాకర్ తెరిస్తే అన్నీ వేయి రూపాయల కట్టలే ఉన్న కోటి రూపాయలు.. వాటితోపాటు మరో లాకర్ తాళంచెవి. అది కార్పొరేషన్ బ్యాంక్ లాకర్‌ది. దాన్నంబరూ పదహారే. అందులోనూ వేయి రూపాయల నోట్ల కట్టలతో మరో కోటి రూపాయలు. మళ్ళీ అక్కడొక లాకర్ కీ. పంజాబ్ నేషనల్ బ్యాంకుది. అంతా కాస్‌కేడింగ్ పద్ధతిన పన్నెండు కోట్ల రూపాయల నగదు రూపంలో ఎప్పటి నుండో ఈ లాకర్లలో మూల్గుతూ.. ఎన్నాళ్ళ యిందో వాటిని తెరువక... నోట్లన్నీ బహుశా ముక్కబట్టి పోవచ్చు. తెరిచి చూసే టైమెక్కడుంది.

ఫైళ్ళు.. ఫైళ్ళు... ఎస్టిమేట్లు... రోడ్లు, బ్రిడ్జిలు, డ్యాంలు... భూములు.. ప్లాట్లు.. వేలాలు... కాన్ఫరెన్సులు.. ప్రమోషన్లు... లంచాలు... విస్కీలు... క్లబ్బులు.. అమ్మాయిల నులివెచ్చని పెదవులు... కౌగిలింతలు... స్వర్గసుఖాలలో కరిగే రాత్రులు. ఒక ఫైవ్‌స్టార్ హోటల్లో ఒక సూట్, ఒక రంభ వంటి అమ్మాయి. అదే కాలంలో పక్కనే మరో ఫైవ్‌స్టార్ హోటల్లో తనకోసం మరో సూట్. అక్కడా ఓ ఊర్వశి తనకోసం. నిరీక్షణ ఏకకాలంలో నాల్గుగదుల్లో... నలుగురు అమ్మాయిలు.. కంట్రాక్టర్లు, మినిస్టర్లు, ఐఏఎస్‌లు, బ్రోకర్లు, తార్పుడుగాళ్ళు, లంజాకొడుకులు... ట్రాష్.

గాజు టేబుళ్ళపై... గాజు గ్లాసుల్లో.. ఎర్రగా, చిక్కగా ఈ దేశపు అతి సామాన్య జనం గొంతులు పిసకగా వచ్చిన ఎర్రని రక్తం.

ఎర్రని రక్తాన్ని... ఏండ్లకు ఏండ్లుగా తాగి తాగి,

కోట్లు... ఎకరాలకు ఎకరాల భూములు... భవనాలకు భవనాలు బినామీ ఆస్తులు... కిలోల కొద్దీ బంగారం.. ఎక్కడివివన్నీ... ఎవరివివన్నీ... ఎందుకివన్నీ... ఎవరికోసం యివన్నీ?

రమణకు దుఃఖం ముంచుకొస్తూనే ఉంది.

బాణం చేతిలోనుండి వెళ్ళిపోయింది. దాన్ని ఆపాలి. ఎలాగైనా ఆపాలి.

అలా ఆపడం సాధ్యమౌతుందా. సాధ్యం చేయాలి... కనీసం దానికన్నా వేగంగా పరుగెత్తి. ఎదుట నిలిచి బలైపోయైనా, దాన్ని ఆపాలి. ప్రాయశ్చిత్తం జరగాలి.

ఈ ప్రాయశ్చిత్తం అనే పదం, క్రియ ఎంత ఉత్కృష్టమైంది. మనిషి చేసిన పాపం... లేదా తప్పు. తప్పును తెలుసుకోవడం... తను చేసిన అకృత్యాన్ని తను గ్రహించడం... గ్రహించి ఆత్మశోధన చేసుకోవడం.. దుఃఖపడడం.. పశ్చాత్తాపపడడం.. బంగారం నిప్పుతో శుద్ధి అయినట్టు మనిషి పశ్చాత్తాపంలో పునీతుడు కావడం... తప్పు తెలుసుకుని తనకు తాను శిక్ష విధించుకోవడం... యిదేనా ప్రాయశ్చిత్తం.

అశోకుడు... యుద్ధానంతర ప్రాయశ్చిత్తం

గౌతముడు... ఒక శవయాత్రను చూచి.. దుఃఖించి... ఆత్మపరిత్యాగం.

యిక శుద్ధి చేసుకోవాలి తను... తనను తాను తననుండి విముక్తం కావాలి.

ఈ డబ్బు గబ్బులోనుండి, ఈ కంపులోనుండి, ఈ చీకట్లోనుండి...

విముక్తం కావాలి తను..

రమణకు ఎందుకో దుఃఖం యింకా ఉధృతంగా ఎగదన్నుకొస్తోంది. కళ్ళలో నుండి నీళ్ళు బుడబుడా దూకుతున్నాయి బయటికి.

ఎదురుగా టేబుల్‌పై అన్నీ ఫైళ్ళు.. ఫైళ్ళు

ఆ రాత్రి తను క్లియర్ చేయాల్సిన ఫైళ్ళు అవన్నీ. కాంట్రాక్టులవి, అగ్రిమెంట్‌లవి, ఎమ్‌ఓయులవి, ప్రమోషన్లవి, ట్రాన్స్‌ఫర్లవి, టెండర్ అలాట్‌మెంట్లవి... అన్నీ కొన్ని కోట్ల రూపాయలవి.

నిర్లిప్తంగా వాటివంక ఒక చూపు చూచి – రమణ ప్రక్కనే అప్పటికే సర్దుకుని పెట్టుకున్న ఒక మామూలు గుడ్డసంచినీ, దాంట్లో యింతకు ముందు కొరియర్లో పంపిన కాగితాల జిరాక్స్ కాపీల కవర్లను తీసుకుని అడుగులు బయటికి వేశాడు.

బంగళా అంతా నిశ్శబ్దంగా ఉంది.

ప్రక్క బెడ్‌రూంలో తన శ్రీమతి.. పార్వతి అప్పటిదాకా తెలుగు టి.వి. సీరియల్స్ చూసి, ఒక క్వార్టర్ ఇంపోర్టెడ్ విస్కీ తాగి, మధురమైన మత్తులో ఒక పిల్ల ఐరావతం వలె.. వెల్లకిలా పడుకొని గురకపెడ్తోంది.

ఆరోజు రమణ కావాలనే తన గన్‌మాన్‌ను యింటికి పంపించాడు. బయట గేట్ దగ్గరుండే కాపలా గూర్ఖాకు బలవంతపు సెలవిచ్చాడు. బంగళా అంతా నిర్మానుష్యంగా ఉంది.

బిటెక్ ఫైనలియర్లో ఉన్న కొడుకు... ఏ అమ్మాయిని కార్లో వేసుకుని ఎక్కడ మన్మథ క్రీడల్లో ఉన్నాడో తెలియదు.

గార్మెంట్ అండ్ కాస్ట్యూమ్ డిజైనింగ్ కోర్సు చదువుతున్న ఒక్కగానొక్క కుమార్తె ఎక్కడ మస్తుగా తాగి ఏ పబ్‌లో తందనాలాడ్తుందో అర్థం కాదు. వాళ్ళు ఏ తెల్లవారుజామునో, ఊగుతూ తూగుతూ డ్రైవర్లు మోసుకొస్తే కొంపకు చేర్తారు.

క్రిందికి వాకిట్లోకి వచ్చిన రమణకు గ్యారేజ్‌లో యింకా నాల్గు యింపోర్టెడ్ కార్లు కనబడ్డాయి. యిదంతా తన ధన సామ్రాజ్యం... ప్చ్...

వర్షం కురుస్తూనే ఉంది... నిశ్శబ్దంగా.

రమణ గొడుగును తెరిచి పట్టుకొని, భుజంలో సంచీతో.... గేట్ దగ్గరికి వచ్చాడు. గూర్ఖా లేడు.

అందమైన లక్ష రూపాయల ఆ గేట్‌ను ఒక కాంట్రాక్టర్ లంచం కింద చేయించివ్వడం జ్ఞాపకమొచ్చింది రమణకు.

రోడ్డుమీదికొచ్చి కొద్దిసేపాగి వర్షంలో వస్తున్న ఓ ఖాళీ ఆటోను ఆపి ఎక్కి, కాచీగూడ చౌరస్తా పోనీ అన్నారు రమణ.

వర్షం ఏకధాటిగా, నిలకడగా, చీకట్లో... కురుస్తూనే ఉంది.

***

రమణ భారంగా నిట్టూర్చి గట్టిగా కళ్ళు మూసుకున్నాడు. లోపల... అంతరాంతరాల్లో ఏదో అదృశ్యమైన విచ్ఛిన్నం, విధ్వంసం జరుగుతున్నట్టు... తను ముక్కలు ముక్కలుగా విడిపోతున్నట్టు... చివరికి... తను మాయమై, మాయమై.. ఒక మాయగానే మిగిలిపోతున్నట్టు...

తను భద్రాచలంలో అపాయింట్‌మెంట్ ఆర్డర్‌తో ఎ.ఇ.గా జాయినింగ్ రిపోర్ట్ యిచ్చి ఉద్యోగంలో చేరిన సందర్భం జ్ఞాపకమొచ్చింది.

అప్పటికి ఉద్యోగంలో చేరి మూడ్రోజులైంది. మొదటిరోజునాడే డి.యి.గారు పిలిచి మనం కూనవరం నుంచి బుట్టాయ్‌గూడెం వరకు నాల్గు కిలోమీటర్లు మట్టిరోడ్డు వేస్తున్నాం. పన్నెండు లక్షలకు ఎస్టిమేట్ చేసి సంతకం చేసి పట్రండి – అన్నాడు.

సరేనని తలాడించి.. వచ్చి సీట్లో కూర్చుని,

మర్నాడు కూనవరం వెళ్ళి, స్థలాన్ని పరిశీలించి, రోడ్డు సర్వే తాలూకు ఏ గుర్తుకూడా కనబడక తిరిగొచ్చి, డి.యి.గార్ని అనుమానంతో అడిగి... చేతులు కట్టుకుని నిలబడగా –

డి.యి. గారు కసురుకుంటూ – తీవ్రస్వరంతో ''మనం అక్కడ రోడ్డు వేయం... వేసినా ఆ రోడ్డు విలువ ఐదు లక్షలకంటే ఎక్కువ కాదు. వేయని రోడ్డుకు పన్నెండు లక్షలు ఎస్టిమేట్ వేసి...శాంక్షన్ చేసి.. ప్రాసెస్‌చేసి... కాంట్రాక్టర్‌కిచ్చినట్టు కాగితాలన్నీ తయారుచేసి... పైన ఇ.ఇ.గారు, ఎస్సీగారు అందరూ మనవాళ్ళేనయా. అంతా సిండికేట్.. అందరూ ఇన్‌స్పెక్షన్, సర్టిఫికేషన్, క్వాలిటీ చెకింగ్ అన్నీ జరుగుతాయి కాగితాలపై. బిల్లు శాంక్షనౌతుంది. రేషియో ప్రకారం డబ్బు బట్వాడా అవుతుంది. నీ వాటా యాభైవేలు. పో.. ఎస్టిమేట్ చేసి సంతకం చేసి పట్రా పో తొందరగా..''


''సార్'' నీళ్ళు నములుతూండగా,

''పోవయ్యా... గో'' అని కసిరి,

నెలరోజుల్లో బిల్లు శాంక్షనై వచ్చి... డబ్బు గప్‌చిప్‌గా బట్వాడా అయి... గిరిజనుల సౌకర్యార్థమై అత్యవసర స్థితిలో వేయబడ్డ రోడ్డుగా రికార్డుల్లో చూపబడి, ఫైల్ ఎల్.డిస్ ఐంది.

ఆ తర్వాత నాలుగు నెలలకు గోదావరి నది అనూహ్యంగా ఉప్పొంగగా వచ్చిన వరదలకు సదరు కూనవరం టు బుట్టాయగూడెం మట్టిరోడ్డు నామరూపాలు లేకుండా కొట్టుకుపోయిందని – మరో ఫైల్ నడిచి క్లోజ్ అయింది. కథ కంచికి... డబ్బు భద్రంగా యిళ్ళలోకి.

అసలే మింగుడుపడని ఈ రోత పద్ధతిలో తాను భాగస్వామిని కాలేనని డి.యి. గారితో రమణ గొడవపడినపుడు – ఆయన చేసిన జ్ఞానబోధ ఏమిటంటే,




''చూడు రమణా... ఈ ఎ.ఇ, డి.ఇ, ఇ.ఇ, ఎస్.ఇల వ్యవస్థ.. ఒక చైన్... గొలుసులో ఎన్నో లింక్‌లుంటాయి. ఏ ఒక్క లింక్‌కు ఇండివిడ్యువాలిటీ ఉండదు. అది మిగతా లింక్‌లతో కలిసి వ్యవస్థలో, పనిలో పాలుపంచుకోవలసిందే. ఏదో ఒక లింక్ సహకరించకుంటే, దాన్ని రిమూవ్ చేస్తాం. చైన్‌ను మార్చం. పో. తేరగా యాభై వేలొస్తే పెండ్లానికి బంగారం కొనివ్వక ఏమిటయ్యా నీ నీతులు. పో గెట్ లాస్ట్ ఫ్రం హియర్'' అని అరిచి, కరిచి...

యాభైవేలు తీసుకుపోయి యిచ్చిన రాత్రి సావిత్రి ఎన్నడూ చూపని కొంత రసానందాన్ని చూపించింది. ఆ రాత్రినుండే... డబ్బు నిషా ఒక బిందువై విప్పారడం మొదలైంది.

నిజానికి ఆ రాత్రే గనుక సావిత్రి... ఈ పాపిష్టి డబ్బు మనకు వద్దండీ, బతికినన్నాళ్ళు నీతిగా బతుకుదాం, కావలిస్తే ఈ ఉద్యోగం విడిచిపెట్టండీ అంటే ఏమయ్యేదో తెలియదు.

మనిషిని ధనచాపల్యం ఆవహించిన తర్వాత... యిక సుఖాల అన్వేషణ, కలల వెంట పరుగు.. కొత్త రుచుల పలవరింత... ఒక మత్తు... ఎడతెగని మైకం... యిక మనిషిని ఫుట్‌బాల్ బంతిని చేసి తంతుంది. బంతికి పరుగే... యిటు వీడు తంతే... అటు పోగానే వాడు తంతాడు. తన్నినవాడెవడైనా.. గోల్ ఎవడికైనా.. బంతికి ఒరిగేదేమీ ఉండదు. బంతికి తన్నులు తప్పవు.

జీవితమనే ఫుట్‌బాల్ కోర్టులో ముప్పయి రెండేళ్ళు తన్నుబడీ తన్నుబడీ... బంతి సొట్టబోయింది.

మొన్న,

ఆ మినిస్టర్‌గాడు ఏమన్నాడు. రాత్రి పది గంటలకు ప్రత్యేకంగా తనను ఛాంబర్‌లోకి ఒంటరిగా పిలిపించుకుని "ఆ ఫ్లైఓవర్ కాంట్రాక్ట్‌ను నేను ఉంచు కున్నదాని మొగునికిస్తున్నానయ్యా. దాని వాల్యూను యింకో యిరవై కోట్లు పెంచు ఎస్టిమేట్‌లో" అన్నారు.

"అదెలా సాధ్యమౌతుందండీ... యిప్పటికే థర్టీ పర్సంట్ ఎక్సెస్ ఎస్టిమేట్ చేశారు దాన్ని. ప్రజాధనం..."

"బొంగు ప్రజలు.. ఎక్కడున్నారయ్యా ప్రజలు ఈ దేశంలో. పోవయ్యా పో... రేపు చేసి తీసుకురా ఫైల్. నువ్వు చేయకుంటే ఆ ఎడిషనల్ చీఫింజనీర్‌తో చేయించి – నేనే సంతకం చేస్తాపో..." అని కసిరి,

మినిస్టరయిన ఆ మాజీ సారా కాంట్రాక్టర్‌ను తను ఏం చేయగలిగాడు.

ఫైల్ మాడిఫై అయింది. వాడే సంతకం చేసుకున్నాడు. ఔట్‌రైట్‌గా యిరవై కోట్లు అదనంగా కొట్టేస్తున్నారు.

ఎలా... ఎలా.. ఎలా..?

ఈ దుర్మార్గాలు.. ఈ దుష్కార్యాలు... ఈ ప్రజాధన దోపిడీ యిలా కొనసాగవలసిందేనా?

యిన్నాళ్లూ ఈ పాపకార్యంలో తనూ ఏదోరకంగా భాగ స్వామి అయ్యాడు కదా.

చటుక్కున తన హైస్కూల్‌లో సింగరాచారి సార్ చెప్పిన మాట గుర్తొచ్చింది.

"ఈ సృష్టిలో ఏ జీవైనా ... తనకు కావలసిన కనీస ఆహా రాన్నే సమకూర్చుకుంటుందిరా. తనకూ, తన పిల్లలకూ, తరతరాలకూ సరిపోయే ఆహార సదుపాయాలను సంపా దించి దాచడం సృష్టికి విరుద్ధం. ఎప్పుడైతే మనిషి సృష్టి నియమాలకు విరుద్ధంగా జీవిస్తాడో ఫలితంగా వాడికి దుఃఖం సంభవిస్తుంది.

అందరికీ చెందవలసిన ఈ దేశసంపదను కొందరే కోట్లకు కోట్లుగా దోపిడీ చేయడం ఎంత ప్రకృతి విరుద్ధమైన చర్య. అప్పుడు దుఃఖం సంభవించాలి గదా... ఎవరికి సంభ విస్తోందా దుఃఖం. దుఖానికి అంతమెక్కడ. ఎలా... ఎలా... ఎలా..?

చటుక్కున ఆటో ఒక్క కుదుపుతో ఆగింది.

రమణ ఉలిక్కిపడి చూశాడు.

వర్షం కొద్దిగా తగ్గి... తుంపర రాలుతోంది.

ఎదుట 'భద్రాచలం' బస్సు సిద్ధంగా ఉంది.

ఆటోకు డబ్బులిచ్చి... బస్సెక్కి టిక్కెట్ తీసుకుని సీట్లో పడుకున్నాడు రమణ.

ఎందుకో అతని మనస్సు కుదుటపడడం మొదలై,

చిత్తం ప్రశాంతమై,

నిర్ణయం – స్థిరమైంది.

బయట సన్నగా వర్షం కురుస్తూనే ఉంది.

తెలతెలవారుతుండగా బస్సు భద్రాచలం చేరింది.

యింకా చీకటి విడిపోలేదు.

రమణ దిగి... చుట్టూ చూశాడు. ఎన్నో ఏండ్లు తాను గడిపిన రాముని సన్నిధి, అంతా పరిచయమైన ప్రాంతమే.

రాత్రి కురిసిన వాన తగ్గింది. కిందంతా తడి... చిత్తడి... జనసంచారమింకా మొదలుకాలేదు.

భుజాన సంచీతో చకచకా రామాలయం వైపు నడవడం ప్రారంభించాడు.

తెలిసిన రోడ్లే... చకచకగా గుడిని చేరుకుని...

ఆలయ ద్వారం తెరువలేదు యింకా. ధ్వజస్తంభాన్ని స్పర్శించి, క్షణంపాటు కళ్ళు మూసుకుని... దుఃఖం ఫౌంటెన్ ఎగజిమ్మింది – వెనుదిరిగి... బయటకు వచ్చాడు.

చకచకా గోదావరి తీరంవైపు నడిచాడు.

ఐదు నిముషాల్లో.

తన తర్వాత తన న్యాయమైన ఆర్జనయైన ఆరు లక్షల జి.పి.ఎఫ్‌ను మాత్రం భార్యాపిల్లలకు చెందవలసినట్టుగా రాసిన వీలునామా, ఈ తన ధర్మసంపాదనతో నైనా వాళ్ళు... ఒక కొత్త మొలకలవలె... జీవితాన్ని పునస్సమీక్షించు కుంటారా...? అవినీతిలో ఉంటూ, అవినీ తినే తింటూ, ఒంటినిండా అవినీతినే రక్తంగా ధరించి భ్రష్టుపట్టి... అవినీతిమ యమైపోతున్న వ్యవస్థ – ఎక్కడో ఒకచోట ... ఈ వ్యవస్థ పునర్నిర్మాణం ప్రారంభం కావాలి

ఎదుట పరమ గంభీర గోదావరి మెట్లను ఒరుసుకుంటూ నిండుగా, భారంగా, నిర్మలంగా, నిశ్చలంగా, నిశ్శబ్దంగా ప్రవహిస్తోంది.

యింకా మానవ సంచారం ప్రారంభం కాలేదు.

ప్రక్కన విద్యుత్ స్తంభం కాంతిని వర్షిస్తోంది. లైట్ కింద చేరి... సంచీని తెరిచి.. జడ్జికి, గవర్నర్‌కి పంపిన తన అఫిడవిట్‌లు, వీలునామా... కాగితాల జిరాక్స్ కాపీలను బయటకు తీసి చూశాడు మరోసారి.

మొత్తం... డెబ్బయి రెండు కోట్ల ఆస్తి తనది.

ఇంటిని వృద్ధాశ్రమానికి, కొన్ని స్థలాలను అంగవికలులైన విద్యార్థుల పాఠ శాలకు, బ్యాంక్ బ్యాలెన్స్‌లను విశ్వసనీయ సేవా సంస్థల ద్వారా సామాజిక కార్యక్రమాలకు చెందవలసిన వివరాల లిస్ట్, బంగారాన్ని దేశరక్షణ నిధికి...,

ఇద్దరు అవినీతిపరులైన మంత్రుల అతి రహస్య వివరాలన్నింటినీ బట్టబ యలు చేసే డాక్యుమెంట్స్ – ప్రజల ముందు వాళ్ళను దోషులుగా నిలబెట్టేం దుకు ఆధారాలు.

ఒక చీఫ్ సెక్రటరీ, ఒక డిపార్ట్‌మెంట్ సెక్రటరీ తాలూకు అవినీతి భాగోతం వివరాలు, సి.డిలు.

పుట్టుకతోనే అవినీతితో తాను సంపాదించిన ఆస్తికి వారసులుగా జన్మించిన తన పిల్లలు జ్ఞాపకమొచ్చారు రమణకు.

ఎప్పుడూ వాళ్ళలో వాత్సల్యం కనబడలేదు. అన్నీ ఆర్థిక సంబంధాలే. అన్నీ డబ్బు కొలతలే. నిజమైన ప్రేమ మచ్చుకైనా లేదు.

పార్వతీ అంతే,

డబ్బు మాయలో తను పడి, తననూ కళ్ళు తెరవ కుండా చేసింది.

ఐతే,

తన తర్వాత తన న్యాయమైన ఆర్జనయైన ఆరు లక్షల జి.పి.ఎఫ్‌ను మాత్రం భార్యాపిల్లలకు చెందవలసినట్టుగా రాసిన వీలునామా,

ఈ తన ధర్మసంపాదనతోనైనా వాళ్ళు... ఒక కొత్త మొలకలవలె... జీవితాన్ని పునస్సమీక్షించుకుంటారా...?

భార్య.. డబ్బు మాత్రమే ప్రధానమైన వ్యాపార సంబంధం.

పిల్లలు... డబ్బుతోనే నాన్నను కొలిచి, డబ్బుతోనే నాన్నను గౌరవించి ఆర్థిక సంబంధం సమాజం... అవినీ తిలో ఉంటూ, అవినీతినే తింటూ, ఒంటినిండా అవినీ తినే రక్తంగా ధరించి భ్రష్టుపట్టి... అవినీతిమయమైపో తున్న వ్యవస్థ –

ఎక్కడో ఒకచోట... ఈ వ్యవస్థ పునర్నిర్మాణం ప్రారంభం కావాలి.

ఈ చెదలు నిర్మూలించబడాలి.

చేతిలోని కవర్లను, వాటిపై రాసి వున్న ప్రముఖ దినపత్రికల ఎడిటర్ల పేర్ని, మీడియా పేర రాయబడ్డ అడ్రస్‌లను ఒకసారి దీక్షగా చూసి... వాటిని పక్కనే ఉన్న పోస్ట్ డబ్బాలో వేసి,

ఒక్కొక్క మెట్టు దిగడం ప్రారంభించాడు రమణ.

అతనిలో దుఃఖం పొంగుకొస్తూనే ఉంది.

ముప్పది రెండేళ్ళు వ్యర్థంగా జీవించి, భూమికి భారమైనందుకు అతనికి పరమ క్షోభగా ఉంది. కన్నీళ్ళు కారుతూనే ఉన్నాయి.

మెట్లు దిగి... దిగి... దిగీ

గోదావరి అతని పాదాలకు చల్లగా తాకింది. పిలిచింది. ఆహ్వానించింది.

నడుస్తూనే ఉన్నాడు. లోపలికి... యింకా యింకా లోపలికి

రమణ గోదావరిలోకి నడుస్తూనే ఉన్నాడు... సరయూ నదిలోకి రాముని వలె.

తూర్పు ఆకాశంలో తెల్లని వెలుగురేఖ మొలకెత్తడం కనిపిస్తోంది. మెలమె ల్లగా.. తెలతెల్లగా –

★